అధ్వానంగా రహదారులు

గుంతల రోడ్లతో ఇబ్బందులు
- మరమ్మతుకు నోచుకోని రహదారులు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు


గుంతలమయంగా మారిన కోనరావుపేటకు వెళ్లే రోడ్డు

రేగొండ : గుంతల రోడ్లుతో ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు.. అధ్వాన రహదారులతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. మండలంలోని వివిధ గ్రామాలను కలిపే అనుసంధాన రోడ్లు పూర్తిగా గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లు నిర్మించి దశాబ్దాలు గడుస్తున్న వాటి మరమ్మతులకు అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదు. రేగొండ మండల కేంద్రం నుంచి భాగిర్థిపేటకు వెళ్లే దారి, కొత్తపల్లి(బి) నుంచి రామన్నగూడెనికి వెళ్లే రోడ్డు, కొత్తపల్లిగోరి మండలంలో సుల్తాన్‌పూర్ నుంచి కోనరావుపేటకు వెళ్లే రోడ్డు, కొత్తపల్లి(కే) నుంచి గాంధీనగర్‌కు వెళ్లే రోడ్డు, అలాగే మండల కేంద్రం నుంచి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాలంటే గుంతల రోడ్లుతో నరకయాతన పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ప్రయాణికులు, వాహనదారులు బెంబెలేత్తుతున్నారు. మండల కేంద్రం కావడంతో వివిధ గ్రామాల నుంచి ప్రజలు నిత్యం ఆయా రోడ్లపై ప్రయాణిస్తుంటారు. సుల్తాన్‌పూర్ నుంచి కోనరావుపేట మీదుగా ములుగు వెళ్తుంటారు. కాని రోడ్డు పూర్తిగా అధ్వాన స్థితికి చేరుకోవడంతో వాహనదారులకు కష్టాలు తప్పడం లేదు. ముఖ్యంగా రాత్రి సమయంలో వాహనదారుల బాధలు వర్ణనాతీతం. చీకట్లో గుంతలు కనిపించకపోవడంతో పలుమార్లు ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. అంతే కాకుండా ఈ రోడ్లపై నిర్మించిన రక్షణ గోడలకు ఇనుప చువ్వలు తేలి ప్రమాదకరంగా మారుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అధ్వానంగా తయారైనా రోడ్ల నిర్మాణాలు చేపట్టి ప్రమాదాలు నివారించాలని కోరుతున్నారు.

దేశ సమగ్రతను కాపాడిన రాజీవ్‌గాంధీ


భూపాలపల్లి రూరల్ : రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ రావు


చిట్యాల: రాజీవ్ గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

భూపాలపల్లి రూరల్ : దేశ సమైక్యత, సమగ్రతను కాపాడిన గొప్ప ప్రధాని రాజీవ్ గాంధీ అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పేర్కొన్నారు. దివంగత నేత, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా బుధవారం భూపాలపల్లిలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్ ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ముందుగా రాజీవ్ గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. రాజీవ్ వర్ధంతి రోజును ఉగ్రవాద వ్యతిరేక దినంగా పాటిస్తున్నామని తెలిపారు. దేశంలో ఐటీ రంగానికి పునాదులు వేసిన గొప్ప మార్గదర్శి, నిరుపేదలకు అండగా నిలిచిన నాయకుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పిప్పాల రాజేందర్, దాట్ల శ్రీనివాస్, ముంజాల రవీందర్, మట్టెవాడ సురేష్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూ నాయకులు పాల్గొన్నారు.

చిట్యాలలో..

చిట్యాల : మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు బుర్ర లక్ష్మణ్ గౌడ్ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల నాయకులు దొడ్డి కిష్టయ్య, చిలుకల రాయకొమురు, మూల శంకర్ గౌడ్, గుమ్మడి సత్యనారాయణ, గుర్రపు తిరుపతి గౌడ్, సరిగోమ్ముల సదయ్య, రాజమౌళి, మల్లేష్, నర్సింహారాములు, మొగిలి, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉపాధ్యాయులకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న రిసోర్స్ పర్సన్

కాటారం : లైఫ్ స్కిల్ ట్రెయినింగ్ ప్రోగ్రాంలో భాగంగా భూపాలపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు బుధవారం పలు అంశాలపై అవగాహన కల్పించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పని చేస్తున్న చైల్డ్ హెల్ప్‌లైన్, 1098, సఖి, బేటీ బచావో, బేటీ పడావో ఇతరాత్ర అంశాలపై శిక్షణ కార్యక్రమంలో ఉపాధ్యాయులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ గుర్రం తిరుపతి, సఖి సెంటర్ కోఆర్డినేటర్ గాయత్రి, ఎంఈఓ దేవా నాయక్, రిసోర్స్ పర్సన్ రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దళితులపై దాడిచేసిన వారిని అరెస్ట్ చేయాలి

కాటారం : నిర్మల్ జిల్లా ముథోల్ గ్రామంలో దళితులపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు పీక కిరణ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కిరణ్ మాట్లాడారు. ముథోల్ గ్రామంలో ప్రభుత్వ భూమిలో బుద్ధ విగ్రహాన్ని స్థాపించి బుద్ధ జయంతి ఉత్సవాన్ని నిర్వహిస్తున్న వారిపై అదే గ్రామానికి చెందిన కొంతమంది దాడి చేసి గాయపర్చారని ఆరోపించారు. ఈ సంఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి దళితులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉండాలని పేర్కొన్నారు. గ్రామస్తులను రెచ్చగొట్టి ప్రజల మధ్య కుల మత విభేదాలు సృష్టిస్తున్న ఆరాచక శక్తులపై పోలీస్ యంత్రాంగం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

రాయితీపై జీలుగ విత్తనాలు

మల్హర్ : మండలంలో కొయ్యూరు ఆగ్రోస్ రైతు సేవాకేంద్రంలో రాయితీపై జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయ అధికారి బొల్లపల్లి శ్రీజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొయ్యూరు ఆగ్రోస్ కేంద్రంలో 50 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు ఉన్నాయని కావాల్సిన రైతులు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్‌తో ఏఓ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

క్రెచ్ పనుల పరిశీలన


పనులు పరిశీలిస్తున్న జీఎం, అధికారులు

భూపాలపల్లి అర్బన్ : ఏరియాలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న క్రైచ్ (శిశు సంరక్షణ) కేంద్రాలను బుధవారం ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. సంస్థలో మహిళా ఉద్యోగులు రోజు రోజుకు పెరుగుతున్న నేపథ్యంలో మైన్స్ రూల్స్ ప్రకారం క్రైచ్ ఏర్పాటు చేస్తున్నట్లు జీఎం రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. అధికారులు కవీంద్ర, రవికుమార్, బాలరాజు, మారుతిలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక


కమిటీ సభ్యులతో నాయకులు

రేగొండ : మండలంలోని కనిపర్తి గ్రామంలో కాంగ్రెస్ గ్రామ కమిటీని బుధవారం ఎన్నుకున్నట్లు ఆ పార్టీ కనిపర్తి ఎంపీటీసీ పరిధి ఇన్‌చార్జ్ బోయిని వినోద్‌కుమార్ తెలిపారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా గుర్రం జగన్, ప్రధాన కార్యదర్శిగా క్యాతం రమేష్, ఉపాధ్యక్షుడిగా దండవేన రమేశ్‌ను ఎన్నుకున్నట్లు చెప్పారు. మండల నాయకులు పున్నం రవి, బొజ్జం రవి, క్యాతం సదయ్య, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు మెడల్స్ ప్రదానం



మంత్రి సీతక్కతో గురుకుల విద్యార్థినులు

కాటారం : మండలంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ బాలికల అప్‌గ్రేడ్ కళాశాలకు చెందిన విద్యార్థినులు ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించగా బుధవారం మంత్రి సీతక్క అభినందించారు. హైదరాబాద్‌లోని కొమురం భీమ్ ఆదివాసీ భవన్‌లో నిర్వహించిన సక్సెస్ మీట్‌లో కళాశాలకు చెందిన సుప్రియ, లావణ్య, సాయికీర్తనను మంత్రి సీతక్క సన్మానించి మెడల్స్‌తో పాటు ప్రశంస పత్రాలు ప్రదానం చేశారు. గురుకులం విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత స్థానంలో నిలవాలని మంత్రి సూచించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ నాగలక్ష్మి తెలిపారు. ప్రిన్సిపాల్‌తో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘సీఎంపీఎఫ్ పెండింగ్‌లో ఉండొద్దు’


మాట్లాడుతున్న కమిషనర్ హరిపచోరి

భూపాలపల్లి అర్బన్ : సీఎంపీఎఫ్, పెన్షన్ల సమస్యలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు వాటిని పరిష్కరించాలని సీఎంపీఎఫ్ కమిషనర్ హరిపచోరి ఆదేశించారు. ఏరియాలోని జీఎం కార్యాలయంలో బుధవారం జీఎం కార్యాలయంలో గుర్తింపు, ప్రాతినిథ్య సంఘాల నాయకులతో జీఎం రాజేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సీఎంపీఎఫ్, పెన్షనర్ల సమస్యలు ఉంటే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని వాటిని పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో అధికారులు, కార్మిక సంఘాల నాయకులు గోవర్ధన్, కవీంద్ర, మారుతి, క్రాంతికుమార్, రాఘవేంద్రరావు, శ్రీధర్ పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామి ఆశీస్సులు ఉండాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిషీధర్‌రెడ్డి


ప్రత్యేక పూజలో పాల్గొన్న నిషీధర్‌రెడ్డి

రేగొండ : ఆంజనేయ స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని బీజేపీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిషీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గూడెపల్లి గ్రామంలో గల అభయాంజనేయ స్వామి ఆలయంలో ధ్వజస్తంభం, నవగ్రహాలు, జంటనాగులు, శ్రీ సుబ్రహ్మణ్య స్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. అభయాంజనేయ స్వామి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లింగంపల్లి ప్రసాద్‌రావు, ఆలయ చైర్మన్ సిరికొండ రవీందర్ రావు, కమిటీ సభ్యులు సుదాటి వేణు, సుధాకర్ రావు, లింగంపల్లి ప్రదీప్‌రావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునఃనిర్మాణానికి భూమి పూజ

రేగొండ : మండలంలోని కోటంచ శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి ఆలయ పునఃనిర్మాణానికి పురోహితులు బుచ్చమచార్యులు ఆధ్వర్యంలో బుధవారం భక్తిశ్రద్ధలతో భూమి పూజ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ స్థపతి వల్లినాయక్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. దేవాదాయ శాఖ ఎస్ఈ దుర్గాప్రసాద్, డీఈ రమేష్, ఆలయ చైర్మన్ భిక్షపతి, కాంగ్రెస్ నాయకులు నాయిని సంపత్‌రావు, గ్రామస్తులు సంపత్‌రావు, కమలాకర్, సిబ్బంది శ్రావణ్, సుధాకర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు అంత ప్రేమ ఎందుకో..

- కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షురాలు మహేశ్వరి


సమావేశంలో మాట్లాడుతున్న మహేశ్వరి

కాటారం : కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ ప్రొటోకాల్ అంశాన్ని రాద్ధాంతం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, పుట్ట మధుకు ఎంపీ అంటే అంత ప్రేమ ఎందుకో చెప్పాలని కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షురాలు జాడి మహేశ్వరి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీకి ప్రతిపక్షంలో ఉన్న పుట్ట మధుకు సంబంధం ఏంటో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. 2014లో ఎమ్మెల్యే కాగానే మంథని నియోజకవర్గంలో జరిగిన నాలుగు దళిత హత్యల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న పుట్ట మధు దళితులపై కపట ప్రేమను వలకపోయడం విడ్డూరమన్నారు. రాజ్యాంగ ఉల్లంఘన జరుగుతుందని అసత్య ఆరోపణలు చేస్తున్న మధు.. వారి హయాంలో అధికారుల చేత ఎన్ని రాజ్యాంగ ఉల్లంఘన పనులు చేయించారని విమర్శించారు. ఎంపీ వంశీ గెలుపునకు మంత్రి శ్రీధర్‌బాబు, యువ నాయకుడు శ్రీనుబాబు ఎంతగానో కృషి చేశారని మంథని నియోజకవర్గంలో అత్యధికంగా మెజార్టీ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మహదేవపూర్, మల్హర్ మండలాల మహిళా అధ్యక్షులు బందెల సత్తమ్మ, కొండ రాజమ్మ పాల్గొన్నారు.

చలివేంద్రం పునఃప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న గ్రామ పంచాయతీ కార్యదర్శి పీటర్ పాల్

పలిమెల : మండలంలోని లెంకల గడ్డ బస్టాండ్ వద్ద బుధవారం చలివేంద్రాన్ని పునఃప్రారంభించారు. సోమవారం పేరుకే చలివేంద్రాల ఏర్పాటు.. అనే శీర్షికతో సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు లెంకలగడ్డలో చలివేంద్రాలను పునఃప్రారంభించారు. గ్రామస్తులు, ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలియజేశారు.

రెవెన్యూ అధికారుల డిప్యుటేషన్ ఎత్తివేయాలి

- బీఆర్ఎస్వీ నాయకుడు రాజుకుమార్


నిరసన వ్యక్తం చేస్తున్న యువకులు

కన్నాయిగూడెం: ఇతర మండలాలకు పంపించిన తహసీల్దార్, ఆర్ఐ ల డిప్యుటేషన్ వెంటనే రద్దు చేయాలని బీఆర్ఎస్వీ ములుగు జిల్లా నాయకుడు దుర్గం రాజు కుమార్ అన్నారు. మండల రెవెన్యూ కార్యాలయానికి బుధవారం వివిధ అవసరాల నిమిత్తం వచ్చిన ప్రజలతో కలిసి కార్యలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా రాజు కుమార్ మాట్లాడుతూ.. మండలంలో విధులు నిర్వర్తించాల్సిన తహసీల్దార్, ఆర్ఐ డిప్యుటేషన్‌పై పక్క మండలాలకు వెళ్లడంతో ఇక్కడి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అధికా రులు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. మండలంలోని విద్యార్థులు కులం, ఆదాయం, నివాసం ధ్రువీకరణ పత్రాల కోసం కార్యలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాసంస్థల ప్రారంభం నాటికి సర్టిఫికెట్లు జారీ చేయాల్సి ఉండగా.. నేటికీ అధికారులు అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారని తెలిపారు.

కూలిన కటౌట్.. తప్పిన ప్రమాదం



ఈదురుగాలులకు కూలిన కటౌట్, ప్రమాదకరంగా కర్రలతో ఉన్న కటౌట్

చిట్యాల : కాళేశ్వరంలో సరస్వతీ పుష్కరాలకు వస్తున్న భక్తులకు స్వాగతం పలికేందుకు ఏర్పాటు చేసిన కటౌట్ బుధవారం గాలిదుమారానికి కూలింది. సోమవారం సాక్షిలో ప్రమాదకరంగా కటౌట్ అనే శీర్షిక వెలువడింది. అయిన అధికారులు దానిని పట్టించుకోని సరిచేయకపోవడంతో గాలిదుమారానికి కూలిపోయింది. రోడ్డుపై నిత్యం రద్దీగా మారిన వాహనాలపై ఎలాంటి ఆటంకం లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. కాగా ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న కటౌట్‌లను తొలగించి భక్తులు ప్రమాదాలబారిన పడకుండా చూడాలి.

బస్టాండ్ క్రాస్ వద్ద ఉన్న ప్రమాదకర కటౌట్‌ను తొలగించాలి..

కాళేశ్వరం బస్టాండ్ నుంచి నూతన బస్టాండ్‌కు వెళ్లే దారిలోని మలుపు వద్ద మరో భారీ కటౌట్ శనివారం రాత్రి వర్షానికి సగం కూలిపోగా కర్రలు మాత్రమే మిగిలాయి. దీంతో అటుగా వెళ్తున్న భక్తులు, వాహనాలపై కూలిపోయే ప్రమాదం ఉంది. సంబంధిత అధికారులు కర్రలతో ఉన్న కటౌట్‌ను తొలగింయచాలని భక్తులు కోరుతున్నారు.

టోల్‌గేట్ వద్ద ట్రాఫిక్ జామ్..


టోల్‌గేట్ వద్ద నిలిచిన వాహనాలు

కాటారం : జాతీయ రహదారి 353(సీ) పై కాటారం మండలం మేడిపల్లి వద్ద ఏర్పాటు చేసిన టోల్‌గేట్‌లో బుధవారం ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కాళేశ్వరంలో కొనసాగుతున్న సరస్వతి పుష్కరాల సందర్భంగా వరంగల్ నుంచి కాళేశ్వరం వెళ్తున్న వాహనాలు అధిక సంఖ్యలో రాకపోకలు కొనసాగుతున్నాయి. టోల్‌గేట్ వద్ద టోల్ రుసుము కోసం ఫాస్టాగ్ స్కాన్ చేసే క్రమంలో ఆలస్యం నెలకొంటుంది. దీంతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. సుమారు కిలో మీటరు మేర వాహనాలు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

ఆదిముక్తీశ్వర ఆలయానికి భక్తులు


ఆది ముక్తీశ్వరస్వామి దేవాలయంలో భక్తులు

భూపాలపల్లి అర్బన్ : కాళేశ్వరం శివారులోని ఆది ముక్తీశ్వర ఆలయానికి భక్తులు తరలిస్తున్నారు. సరస్వతి పుష్కర ఘాట్ వద్ద పుష్కర స్నానాలు చేసిన అనంతరం భక్తులు ఆది ముక్తీశ్వర ఆలయానికి చేరుకొని మొక్కులు చెల్లిస్తున్నారు.

కొబ్బరి చిప్పలతో ఉపాధి


కొబ్బరి ముక్కలను ఆరబెడుతున్న మహిళ

భూపాలపల్లి అర్బన్ : సరస్వతి పుష్కరాల నేపథ్యంలో స్థానికులు కొబ్బరి చిప్పల ద్వారా ఉపాధి పొందుతున్నారు. త్రివేణి సంగమం సరస్వతి పుష్కర ఘాట్ వద్ద భక్తులు స్నానాలు చేసి గంగమ్మకు కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లిస్తున్నారు. దీంతో అక్కడ భక్తులు వదిలిన కొబ్బరి కాయలను స్థానికులు సేకరించుకొని ఎండలో ఆరబెడుతున్నారు.

ప్రమాదమని తెలిసినా!


నిర్మాణంలో ఉన్న భవనంలో కూర్చున్న భక్తులు

చిట్యాల : కాళేశ్వరం పుష్కర ఘాట్ వద్ద నిర్మిస్తున్న భవనంలో భక్తులు సేదదీరుతున్నారు. దీంతో ఏదైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని పలువురు భక్తులు ఆవేదన చెందుతున్నారు. పుష్కర ఘాట్ వద్ద నిలువ నీడ లేకపోవడంతో భక్తులు నిర్మాణంలో ఉన్న భవనంలో తలదాచుకుంటున్నారు. దీంతో సెంట్రింగ్ కర్రలు, ప్లేట్లు కూలిపోతే భక్తులకు తీవ్ర ప్రమాదం జరిగే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి భక్తులు భవనంలోకి వెళ్లకుండా చుట్టూ పరదా ఏర్పాటు చేయాలి.

సరస్వతీయే నమః
పుష్కరాలు - 2025

శివతత్వంపై ప్రవచనం



కాళేశ్వరం : కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి నది పుష్కరాల సందర్భంగా ఆలయంలో వెంపరాల శ్రీనివాసరావు శివతత్వంపై భక్తులకు ప్రవచనాలు వినిపించారు. బుధవారం ఆలయంలో ఆయనకు ఈఓ మహేష్ పూలమాల వేసి స్వాగతం పలకగా, ప్రవచనాలు ప్రారంభించారు.

చిన్నారులకు పోషకాహారం పంపిణీ


పోషకాహారం అందజేస్తున్న సీడీపీఓ రాధిక

చిట్యాల : కాళేశ్వరంలోని పుష్కర ఘాట్ వద్ద బుధవారం పిల్లలకు, గర్భిణులకు ఐసీడీఎస్ సీడీపీఓ రాధిక పోషకాహారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..గర్భిణులకు, పిల్లలకు, బాలింతలకు పోషికాహారం ఎంతో మేలన్నారు. అలాగే సఖి కేంద్రం ఆధ్వర్యంలో గృహహింస, వరకట్న వేధింపులు, మహిళాహెల్ప్‌లైన్ 181కు సంప్రదించాలని అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ నాగరాణి,అనూష, మాధవి, చంద్రమౌళి, విజ్ఞాన్ పాల్గొన్నారు.

డోలక్ విక్రయాలు


పుష్కరాల్లో డోలక్ విక్రయిస్తున్న వ్యక్తి

పలిమెల : కాళేశ్వరంలో కొనసాగుతున్న సరస్వతి పుష్కరాల్లో పొట్టకూటి కోసం హైదరాబాద్ నుంచి వచ్చిన ఓ వ్యక్తి డోలక్‌లు అమ్ముకుంటున్నాడు. తన వృత్తి దైవంగా డోలక్‌లను తయారు చేసుకొని విక్రయిస్తున్నట్టు తెలిపాడు. జాతరలు, ఉత్సవాల్లో డోలక్‌లు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నట్లు చెప్పాడు.

వస్త్రాల హుండీలు ఏర్పాటు


మండపంలో ఏర్పాటు చేసిన వస్త్రాల హుండీలు

కాళేశ్వరం : కాళేశ్వరంలోని శ్రీ కాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయ ప్రధాన మండపంలో భక్తులు కానుకలు సమర్పించేందుకు దేవాదాయ శాఖ అధికారులు ప్రత్యేకంగా వస్త్రాల హుండీలను ఏర్పాటు చేశారు. దీంతో భక్తులు ఆయా హుండీల్లో కానుకలు వేస్తున్నారు.

మోడ్రన్ టాయిలెట్లు


ఏర్పాటు చేసిన మోడ్రన్ మరుగుదొడ్లు

కాటారం : కాళేశ్వరంలో కొనసాగుతున్న సరస్వతి పుష్కరాల్లో భాగంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం సరస్వతి (వీఐపీ) ఘాట్ సమీపంలో అధికారులు మోడ్రన్ టాయిలెట్స్, గల్పర్ యంత్రాలు, బయోటాయిలెట్స్ ఏర్పాటు చేశారు. పారిశుద్ధ కార్మికులు వాటి పరిసర ప్రాంతాల్లో నిత్యం బ్లీచింగ్ చేస్తూ శుభ్రంగా ఉంచుతున్నారు.

దుస్తులకు భలే గిరాకీ..

కాళేశ్వరం : పుష్కరాలకు వచ్చిన భక్తులు అకాల వర్షంతో తడిసి ముద్దయ్యారు. బుధవారం సాయంత్రం తిరుగు ప్రయాణంలో కురిసిన వర్షంలో తడిసిపోయారు. దీంతో వారు ధరించిన డ్రెస్‌లు, చీరలు పూర్తిగా తడిసిపోయి వణికిపోయారు. దీంతో చేసేది ఏమి లేక దగ్గరలోని వస్త్రాల దుకాణాలకు పరుగులు తీశారు. ఆయా దుకాణాల్లో పుష్కర భక్తులతో రద్దీ నెలకొంది. కాళేశ్వరం, కాటారం, భూపాలపల్లి దుకాణాల్లో పంచెలు, టీ షర్ట్‌లు, చీరలు, డ్రెస్‌లు కొనుగోలు చేసినట్లు తెలిసింది.

ట్రాఫిక్ కోన్స్‌లు సరిచేసిన ఎస్సై

పలిమెల : కాళేశ్వరంలో కొనసాగుతున్న సరస్వతి పుష్కరాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తున్నారు. దీంతో బుధవారం కాళేశ్వరంలో ఈదురుగాలులు, వర్షం రావడంతో బారికేడ్లతో ఏర్పాటు చేసిన రోడ్ ట్రాఫిక్ కోన్స్ పడిపోయాయి. దీంతో డ్యూటీలో భాగంగా అటుగా వెళ్తున్న పలిమెల ఎస్సై రమేష్ రోడ్ ట్రాఫిక్ కోన్స్‌ను సరిచేశారు.